మినీ కథ

# "ఆడబుద్ధి"

బ్యాంక్ నుంచి ఉసూరుమంటూ సాయంత్రం ఇంటికొచ్చిన శారదకి, లోపల్నించి తన భర్త కంఠం వినపడగానే, టక్కున ఆగి, వినసాగింది. "శాంతీ! నువ్వు లేనిదే, నేను బ్రతకలేను. నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నిన్నెలాగైనా పెళ్ళి చేసుకుంటాను. ప్లీజ్! నా మాట నమ్మవూ!" టక్కున మాటలు ఆగిపోయాయి. ఒక్క క్షణం శిలాప్రతిమలా నిలబడిపోయిన శారద భర్త మాటలకి తిరిగి చూసింది.

"ఏయ్! శారూ! ఎంతసేపైందోయ్! వచ్చి! ఈరోజు, నీకంటె ముందు వచ్చేసానోయ్! ఇవాళ కొంచెం పనుంది" అన్నాడు శేఖర్.

"ఆ... తెలుస్తూనే వుంది. మీ పనేమిటో!" అంటూ, ఇల్లంతా కలియదిరుగుతూ, దేనికోసమో వెతుకుతున్నదానిలా, కన్పించింది శేఖర్‌కి.

"ఏమిటోయ్! వెతుకుతున్నావ్! ఏదైనా, పారేసుకున్నావా?" ఆశ్చర్యాన్ని ప్రకటించాడు, శేఖర్.

"ఆహా... ఏమీ తెలీని నంగనాచిలా, మాట్లాడకండి. ఇంతకీ ఎవరా శాంతి? ఎక్కడా కన్పించదేం?" కోపంతో, ముక్కుపుటాలెగరేసింది శారద.

"శాంతెవరు? ఏమిటే నువ్వు మాట్లాడేది?" అన్నాడు శేఖర్. ఏమీ తెలీని అమాయకుడిలా అడిగే భర్త తీరుకి శారదకి కోపం తారస్థాయి నందుకుంది.

"ఎవరా? ఇంతవరకూ మీరు మాట్లాడుతున్నారే! ఆవిడ! ఆ శాంతి! అదెవరు?" అంది కోపంగా.

పకపకమని నవ్వుతున్న భర్తవంక అయోమయంగా చూసింది శారద.

"అదేనోయ్! మా ఆఫీసు స్టాఫంతా కల్సి చిన్న నాటకం వేసి, ఆ డబ్బుతో 'ముఖ్యమంత్రి తుపాను బాధితుల సహాయ నిధి'కి పంపిద్దాం అనుకుంటున్నాం. ఆ నాటకంలో డైలాగులే, నేను ప్రాక్టీస్ చేస్తుంటే, ఇంతలో నువ్వొచ్చి ఇంత తుపాను సృష్టించావు. భలేదానివే! మొత్తానికి ఆడబుద్ధి పోనిచ్చావు కాదు" అన్నాడు నవ్వుతూ.

"ఆ... మిమ్మల్ని అనవసరంగా అపార్థం చేసుకున్నాను. నన్ను క్షమించండి అంది చిన్నబోయిన ముఖంతో.

"ఆల్‌రైట్! క్షమించేశాం!" అన్నాడు శేఖర్ నవ్వుతూ!

—కస్తూరి అలివేలుమంగ

ఎందుకు
అడవి నంత నరికి
ఇంటి నిండా తలుపులు బిగిస్తున్నావు
చీమలు అంతఃపురానికి
సొరంగాలు చేసి
అడవుల్లోకి స్వేచ్ఛకోసం
బారులు తీరిన విషయం తెలియదా !

ఎందునన్ను
కుండీలో బంధించి
నీ పడక గదిలో
తలగడ దగ్గర వుంచావు
సూర్యకిరణం
కిటికీ అద్దాన్ని దాటొచ్చి
నన్ను స్పృశిస్తుంది
చూశావా !

నాకన్నులు తెల్లని కొంగల్లా ఎగురుతున్నాయని
వాటికి ఉచ్చు లేయ చూస్తున్నావు
కొల్లేరు దుర్గంధమైందని
తెలుసుకొని
అవి ఖండ ఖండాంతరాలకు
దాటి వెళుతున్నాయి

నాస్వరం
సైనిక కవాతులకు
మార్చి బాండ్‌గా వుందని
నీవు తలవంచి
నాపాదాల వంక చూస్తున్నావు
అవి ఇనుప కచ్చడాలను
బూట్లుగా మల్చుకొని
తమను తాము రక్షించుకొనే
సామర్థ్యాన్ని ప్రకటిస్తున్నాయి.

నేను
సముద్రంమీద వడచి పోతున్నానని
ఆశ్చర్యంగా చూస్తున్నావా
నీ చెక్కల నావ నాకక్కరలేదు

# స్వేచ్ఛకోసం

—కత్తి పద్మారావు



నామనస్సు రెక్కలు విరవాలని
నీవు ఆరాటపడ్డావే
అవి నీటిని నిప్పుని
జయిస్తున్నాయి
ఎందుకలా
నా నల్ల సిరా పేపరునిండా
ఎర్ర గీతలతో కొట్టి వేతలు చేస్తావ్
నా పేపరు నే నే దిద్దుకోగలను

పండితులారా !
నేను అక్షరాన్ని కన్నదానను
నా కొడుకు కన్నెకే పుట్టాడు
నేను తల్లిని కావడానికి
నీ మంత్ర పుష్పం నాకక్కరలేదు
నే నిప్పుడు తలెత్తుకు నడుస్తున్నాను
నా అడుగుల చప్పుళ్ళకు
కొండలు నెర్రెలు పడుతున్నాయి

గొర్రెల కాపరుడా !
ఇపుడు గొర్రి నీకర్ర కిందలేదు
అదుగో
అటు కొండ శిఖరాన చూడు
ఇపుడు
తలెత్తడమే
యుగధర్మం.

